ఎమ్మెల్సీ కవితకు జన్మదిన శుభాకాంక్షలు

బడంపేట్, మార్చి 13 : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదినం సందర్భంగా గురువారం బీఆర్ఎస్ మీర్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి జూబ్లీహిల్స్‌లోని ఆమె నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీ కవిత భవిష్యత్‌లో ఉన్నత పదవులను అలంకరించి ప్రజలకు అండగా ఉండాలని అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ ప్రజల కోసం పని చేస్తున్నారని అన్నారు.

దర్శకుడు పీసీ ఆదిత్యకు సన్మానం

మన్సురాబాద్, మార్చి 12: భువనేశ్వర్‌కు చెందిన ప్రముఖ సేవా సాంస్కృతిక సంస్థ ఫేమస్ పీపుల్ ఇండియా ఇటీవల దర్శకుడు పీసీ ఆదిత్యకు మహాత్మాగాంధీ స్మారక అవార్డును అందజేసింది. అవార్డును అందుకున్న పీసీ ఆదిత్యను గురువారం నాగోల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ స్మారక పురస్కారం అందుకున్న దర్శకుడు పీసీ ఆదిత్య మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

పార్కులతోపాటు క్రీడాస్థలాలు అవసరమే..

- ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

బీఎన్‌రెడ్డి నగర్ ఆడియోటోరియంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, మార్చి 13 : ప్రజలకు పార్కులతోపాటు, యువతకు క్రీడాస్థలాలు అవసరమని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం బీఎన్ రెడ్డి నగర్ డివిజన్‌లో ఎమ్మెల్యే పర్యటించారు. బీఎన్‌రెడ్డి నగర్ ఫేజ్-3లో నూతనంగా నిర్మించిన పార్కును పరిశీలించి అనంతరం స్థానిక ఆడిటోరియంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వనస్థలిపురంలో అవకాశం ఉన్న ప్రతి చోట అద్భుతమైన పార్కులు నిర్మించామన్నారు. ప్రస్తుతం క్రీడా స్థలాలపై దృష్టి పెట్టామని, సుష్మ థియేటర్ వెనుక, గాయత్రిభవన్ ప్రాంగణం, డీపీఎస్ గ్రౌండ్‌లను అద్భుతమైన క్రీడా ప్రాంగణాలుగా తీర్చిదిద్దబోతున్నామన్నారు. కొన్నిచోట్ల స్థానికులు అభ్యంతరం చెబుతున్నారని, ఇది సరికాదని పేర్కొన్నారు. క్రీడా మైదానాలు ఉపయోగించుకుని యువత శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవుతారన్నారు. భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకొని పార్కులు క్రీడాస్థలాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో వందల కోట్లతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. 118 జీవోను తీసుకువచ్చి బీఎన్ రెడ్డినగర్ డివిజన్‌లో రిజిస్ట్రేషన్ల సమస్యను పరిష్కరించిన ట్లు చెప్పారు. సగానికి పైగా బాధితులకు కన్వీనియన్స్ డీడ్‌లు ఇప్పించామని, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 118 జీవోకి కొర్రీలు పెడుతుందని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు జీవో అమలు కాకుండా అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరి బాధితుడి వరకు న్యాయం చేసేదాకా పోరాడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, అనిల్ చౌదరి, సుమన్ గౌడ్, శివశంకర్, శ్రీనివాస్, కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మేస్త్రీకాలనీలో నిర్మించిన నూతన పార్కును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శివగంగా కాలనీలో పార్కు స్థలం పరిశీలన

ఆక్రమణకు గురైన పార్కు స్థలాన్ని పరిశీలిస్తున్న హైడ్రా అధికారి బాచిరెడ్డి

మన్సురాబాద్, మార్చి 13: హయత్‌నగర్ పరిధి శివగంగా కాలనీలోని పార్కు స్థలం కబ్జాకు గురయ్యిందంటూ కొందరు కాలనీవాసులు ఇటీవల హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. గురువారం హైడ్రా అధికారి బాచిరెడ్డి పార్కు స్థలాన్ని పరిశీలించారు. కాలనీ అధ్యక్షుడు తొంట బాబు గత నెల 15న శివగంగా కాలనీ పార్కు స్థలం కబ్జాకు గురవుతుందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ దృష్టికి తీసుకెళ్లారు. పార్కు స్థలం కబ్జా గురైన డాక్యుమెంట్లను, లేఅవుట్‌ను కాలనీవాసులు అందజేశారు. సుమారు 153 గజాల స్థలం కబ్జాకు గురైందని బహిరంగ మార్కెట్‌లో దీని విలువ కోటి రూపాయలకు పైగా ఉంటుందని కాలనీవాసులు తెలిపారు. కబ్జాదారుడు తమ కాలనీ పేరుతో తప్పుడు లెటర్ ప్యాడ్ సృష్టించి కాలనీ అధ్యక్షుడిని తానేనని అధికారులను మభ్యపెడుతున్నాడని వారు హైడ్రా అధికారికి వివరించారు. కార్యక్రమంలో కాలనీవాసులు నకిరేకంటి వెంకటేశ్‌గౌడ్, సతీశ్‌రెడ్డి, నరసింహ యాదవ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరల పంపిణీ

ఆర్కే పురం, మార్చి 13 : సామాజికవేత్త చిలుక మధురా ఉపేందర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం వందమంది పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దీప ఫౌండేషన్ చైర్మన్ దీప భాస్కర్‌రెడ్డి హాజరై మహిళలకు చీరలు అందజేశారు. అనంతరం విందు ఏర్పాటు చేశారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపడుతానని ఉపేందర్‌రెడ్డి తెలిపారు.

సలీంనగర్‌లో కాముని దహనం

మలక్‌పేట, మార్చి 13: ఫాల్గుణ పౌర్ణమి (కాముడి పున్నమి)ని పురస్కరించుకొని సలీంనగర్‌లోని గణపతి దేవాలయం వద్ద గురువారం కామ దహనం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు తుమ్మల పల్లి రమేశ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీపురం కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కామ దహన కార్యక్రమానికి మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పిడకలు, పాడైన వస్తువులు వేసి కాముడికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం దహనం చేశారు. ముళ్లపూడి శ్రీనివాసరావు, రామకృష్ణ, దుబాయ్ శ్రీను, దామోదర్, చంద్రశేఖర్, గజానంద్, వరప్రసాద్, వేణు, శ్రీపురంలక్ష్మీ, రాజేశ్వరి,వనజ, శ్రీదేవి, లక్ష్మీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో రాజకీయాలు తగవు : బీఆర్ఎస్

మన్సూరాబాద్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

మన్సూరాబాద్, మార్చి 13: అభివృద్ధి పనుల విషయంలో బీజేపీకి చెందిన మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి రాజకీయాలు చేయడం మానుకోవాలని డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు టంగుటూరి నాగరాజు అన్నారు. మన్సూరాబాద్ డివిజన్‌లో గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రొటోకాల్ పాటిస్తూ డివిజన్‌లో బుధవారం చేపట్టిన అభివృద్ధి పనుల విషయంపై బీజేపీ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డికి తెలియజేసినప్పటికీ రాకుండా రాజకీయాలు చేస్తున్నాడని విమర్శించారు. అంతేకాకుండా ఎమ్మెల్యేపై నిందలు వేయడం ఆయన మూర్ఖత్వానికి నిదర్శనం అన్నారు. డివిజన్ అభివృద్ధికి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి 95శాతం నిధులు మంజూరు చేయిస్తే..కార్పొరేటర్ కేవలం ఐదు శాతం నిధులు తీసుకువచ్చాడన్నారు. జడ్జెస్ కాలనీ శ్మశానవాటిక, ఆటో నగర్ డంపింగ్ యార్డ్ అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యాచరణ పై ఎమ్మెల్యే ఆయా ప్రాంతాల్లో పర్యటించగానే మరుసటిరోజే కార్పొరేటర్ వెళ్లి నేను ఈ విషయంపై కష్టపడుతున్నానంటూ ఫొటోలు దిగి సోషల్ మీడియాలో ప్రచారాలు చేసుకోవడం నిజం కాదా? అని పేర్కొన్నారు. కార్పొరేటరే కాంగ్రెస్ పార్టీతో కుమ్మక్కై కుటిల రాజకీయాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. ఇప్పటికైనా కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి బుద్ధి మార్చుకుని డివిజన్ అభివృద్ధి కోసం పాటుపడాలని హితవు పలికారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, సీనియర్ నాయకులు జక్కిడి రఘువీర్‌రెడ్డి, జగదీశ్‌యాదవ్, యాదగిరి, జగదీశ్‌గౌడ్, వెంకన్న కురుమ, నరసింహ గౌడ్, చంద్రమోహన్, అంజి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కవయిత్రి మొల్లమాంబ జయంతి

కందుకూరులో మొల్ల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కుమ్మరి సంఘం నాయకులు

కందుకూరు. మార్చి 13 : తెలుగు కవయిత్రి మొల్లమాంబ అందరికీ ఆదర్శమని కుమ్మరి సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఎగిరిశెట్టి బాలయ్య, మండలాధ్యక్షుడు బొడ్డుపల్లి రవి, యూత్ అధ్యక్షుడు ఏ. నరేశ్ అన్నారు. గురువారం మొల్ల జయంతిని పురస్కరించుకొని కందుకూరులో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొల్ల ప్రసిద్ధి చెందిన రామాయణం రాసినట్లు పేర్కొన్నారు. 16వ శతాబ్దపు తొలి తెలుగు కవయిత్రి. మాతృశ్రీ మొల్లమాంబ అని తెలిపారు. కుమ్మరి కుటుంబంలో జన్మించిన మొల్ల శ్రీ కృష్ణదేవ రాయల కాలంలో ప్రాశస్త్యం చెందిందన్నారు. మొల్ల శైలి సరళమైనది, రమణీయమైనదని పేర్కొన్నారు. కార్యక్రమంలో తుక్కుగూడ మున్సిపల్ కౌన్సిలర్ భావన సుధాకర్, మాడుగుల రాజు, జయమ్మ, సిరిగిరిపురం సర్పంచ్ కాసుల సురేశ్, జంగయ్య, రాజు, మధు, సురేశ్, నరసింహ, లింగమయ్య, అంజయ్య, ఈశ్వరయ్య, కందుకూరు, మహేశ్వర మండలాల కుమ్మరి సంఘం కార్యవర్గ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

సరూర్‌నగర్ డివిజన్ అభివృద్ధికి కృషి

డీసీ సుజాతతో కలిసి సరూర్‌నగర్ చౌడిలో పర్యటిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణిఅంజన్

ఆర్కే పురం, మార్చి 13 : సరూర్‌నగర్ డివిజన్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని కార్పొరేటర్ ఆకుల శ్రీవాణీఅంజన్ అన్నారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా గురువారం ఉదయం సరూర్‌నగర్ సర్కిల్ ఉప కమిషనర్ సుజాతతో కలిసి కార్పొరేటర్ డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా చౌడి వద్ద ఉన్న శిథిలావస్థలో ఉన్న పాత భవనాన్ని పరిశీలించారు. ఈ భవనం వల్ల ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదని, కూలిపోయే దశలో ఉన్నందున వెంటనే తొలగించాలని డీసీకి వినతపత్రం అందజేశారు. గ్రేటర్ హైదరాబాద్‌లోనే సరూర్‌నగర్‌ను మాడల్ డివిజన్‌గా తయారు చేసేందుకు అధికారులతో కలిసి పనిచేస్తున్నామన్నారు. డివిజన్ అభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు.

పేద ముస్లింలకు రంజాన్ కిట్ల అందజేత

రంజాన్ కిట్లను పంపిణీ చేస్తున్న మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల

సైదాబాద్, ఫిబ్రవరి 13 : రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలను పురస్కరించుకొని పేద ముస్లింలకు రంజాన్-కరీంలో భాగంగా గురువారం మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల నిత్యావసర వస్తువులతో కూడిన రంజాన్ కిట్లను అందజేశారు. అక్బర్‌బాగ్ డివిజన్ పరిధి ముంతాజ్ కాలనీలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే రంజాన్ కిట్లను అందజేసి మాట్లాడారు. ప్రవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు కొనసాగిస్తున్న పేద ముస్లింలు ఇబ్బందులు పడకుండా వారికి చేయూతనిందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మజ్లిస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హోలీ వేడుకల్లో సహజ రంగులు వాడాలి

చిన్నారులకు సహజ రంగులు పంపిణీ చేస్తున్న మాజీ కార్పొరేటర్ అనితా దయాకర్‌రెడ్డి

ఆర్కేపురం, మార్చి 13 : హోలీ వేడుకల్లో ప్రతి ఒక్కరూ సహజసిద్ధమైన రంగులనే వాడాలని సరూర్‌నగర్ మాజీ కార్పొరేటర్ పారుపల్లి అనితాదయాకర్ రెడ్డి సూచించారు. గురువారం సరూర్‌నగర్‌లో మహిళా అవేర్‌నెస్ రీసోర్స్ సొసైటీ(మార్స్) ఆధ్వర్యంలో హోలీ పండుగ సందర్భంగా సహజసిద్ధమైన రంగులను మాజీ కార్పొరేటర్ చిన్నారులు, మహిళలకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హోలీ పండుగ పేదల జీవితాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాలని ఆకాంక్షించారు.

ఘనంగా లార్డ్స్ స్కూల్ వార్షికోత్సవం

బడంగ్‌పేట్, మార్చి 13 : బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి వినాయక హిల్స్‌లోని లార్డ్స్ పాఠశాల వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. లార్డ్స్ విద్యా సంస్థలు స్థాపించి 20 ఏండ్లయిన సందర్భంగా రిథమ్ -2025 పేరుతో విద్యాసంస్థల చైర్మన్ సిద్ధల బీరప్ప, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీలత ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీర్ట్ మెంబర్, సైకాలజిస్ట్ సీహెచ్ శేషు హాజరై మాట్లాడారు. మొబైల్ ఫోన్స్‌కి పిల్లలను దూరంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సుధాకర్ బండారి, మాజీ కార్పొరేటర్ దీపికాశేఖర్‌రెడ్డి, యాదగిరి గౌడ్, శివారెడ్డి, పురుషోత్తంరెడ్డి. సతీశ్‌కుమార్, జ్యోతిర్మయి తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ రిలే దీక్షలు

బడంగ్‌పేట్, మార్చి 13 : మహేశ్వరం మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి మాదిగ, మాదిగ ఉపకులాలకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని వారు డిమాండ్ చేశారు. దీక్షలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ప్రశాంత్ మాదిగ, నాయకులు రవి మాదిగ, గణేశ్‌మాదిగ, కృష్ణ, జంగన్న, స్వామి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

మలక్‌పేట, మార్చి 13: ఫాల్గుణ మాస శుక్లపక్ష చతుర్దశిని పురస్కరించుకొని గురువారం సలీంనగర్‌లోని షిర్డీ సాయిసంస్థాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీపురం కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం పౌర్ణమిని పురస్కరించుకొని ఆలయంలో చండీ హోమం నిర్వహించనున్నట్లు తెలిపారు. హోమంలో పాల్గొనే దంపతులు ఆలయ కమిటీ సభ్యులను సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి చేయూతనందిస్తా...

మన్సూరాబాద్, మార్చి 13: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకారం అందిస్తానని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి అన్నారు. మనసురాబాద్ చౌరస్తాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తన సొంత నిధులు, మిత్రుల సహకారంతో చేపట్టిన అభివృద్ధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. మిత్రుల సహకారంతో పాఠశాలలో మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు యాదగిరి, కవిత, నాయకులు హరీశ్‌రెడ్డి, జగన్, శ్రీధర్ గౌడ్, ఉపేందర్‌రెడ్డి, శంకరయ్య, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

16న మహిళా జాబ్‌మేళా

ఘట్‌కేసర్, మార్చి13: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 16న రాచకొండ పోలీస్ కమిషనరేట్, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ సంయుక్తంగా మహిళా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపారు. నగరంలోని నాగోల్ ఎస్వీ ఎం గ్రాండ్ హోటల్‌లో 16న ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జాబ్‌మేళా ఉంటుందని తెలిపారు.

నివాస భవనాలు సీజ్.. కమర్షియల్‌కు ఓకే

- బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారుల ద్వంద వైఖరి
- ముడుపులు దండుకుని పట్టించుకోవడంలేదని స్థానికుల ఆరోపణ

శ్రీపురం కాలనీ ఆర్చి వద్ద అనుమతుల్లేకుండా నిర్మించిన వాణిజ్య భవనం

బీఎన్‌రెడ్డినగర్ చౌరస్తాలో నిర్మించిన బహుళ అంతస్తున్న వాణిజ్య భవనం

వనస్థలిపురం, మార్చి 13 : మధ్య తరగతి ప్రజల కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం 118 జీవోను తీసుకువచ్చింది. దశాబ్దాల సమస్యను పరిష్కరించింది.. కానీ ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం జీవో స్ఫూర్తికి తూట్లు పొడుస్తూ రోజుకో కొర్రీ పెడుతున్నది. ఇందుకు బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో టౌన్ ప్లానింగ్ అధికారుల తీరు అద్దం పడుతున్నది. నివాస భవనాల పట్ల కఠినంగా వ్యవహరిస్తూ, వాణిజ్య భవనాలను మాత్రం వదిలేస్తుండటంతో వారి పనితీరుపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నివాస భవనాలు సీజ్..

సాగర్ కాంప్లెక్స్, శ్రీపురం కాలనీలో మధ్య తరగతి ప్రజలు అప్పులు చేసి ఇండ్లు నిర్మించుకుంటే జీహెచ్ఎంసీ అధికారులు పోలీసులతో వచ్చి మూడు ఇండ్లను సీజ్ చేశారు. దాంతో వారి సొంతింటి కల కల్లలైపోయింది. కాగా అదే కాలనీలో కమర్షియల్ నిర్మాణాలు మాత్రం యథేచ్ఛగా నిర్మిస్తున్నా కనీసం పట్టించుకోవడం లేదు. శ్రీపురం కాలనీ ఆర్చి వద్ద జరుగుతున్న కమర్షియల్ నిర్మాణం ఇందుకు నిదర్శనం. అదే రోడ్డులో పదుల సంఖ్యలో వాణిజ్య భవనాల నిర్మాణం జరుగుతున్నా.. ఫిర్యాదులున్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినవస్తున్నాయి. బీఎన్‌రెడ్డినగర్‌లో బహుళ అంతస్తుల వాణిజ్య భవనం నిర్మాణం జరుగుతున్నా అధికారుల కంటికి కనిపించకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. దాంతో సదరు అక్రమ నిర్మాణాల నుంచి టౌన్ ప్లానింగ్ శాఖకు భారీగానే ముడుపులు అందుతున్నాయన్న ప్రచారం జరుగుతున్నది.

నివాసాలకు అనుమతి తీసుకుని వాణిజ్య నిర్మాణాల నిర్మాణం

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లోని ఎన్జీవోస్ కాలనీ, సాగర్ రోడ్డులో పదుల సంఖ్యలో నిర్మాణాలు జరుగుతున్నాయి. అన్నీ రెసిడెన్సియల్ అనుమతులు తీసుకుని వాణిజ్య భవనాలు నిర్మించి వినియోగిస్తున్నారు. కానీ అధికారులు మాత్రం పట్టించుకున్న పాపాన పోవడందు. ఎవరైనా ఫిర్యాదులు చేస్తే అక్కడకు వెళ్లి నిర్మాణదారులతో బేరసారాలు కుదుర్చుకుంటున్నారన్న విమర్శలు వినవస్తున్నాయి. మూడు నెలల క్రితం ఓ వ్యక్తి విజయపురి కాలనీ ఫేజ్-2లో ఓ భవనంపై లిఖిత పూర్వక ఫిర్యాదు ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోయాడు. టౌన్ ప్లానింగ్ అధికారుల ద్వంద నీతి వెనుక అవినీతి ఆరోపణలున్నట్లు పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

ఇంటి పన్ను తగ్గించాలని సీడీఎంఏకు వినతి

సీడీఎంఏకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

బడంగ్‌పేట్, మార్చి 13 : మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇంటి పన్నులు తగ్గించాలని (సీడీఎంఏ)కమిషనర్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారికి బీజేపీ మీర్‌పేట్ అధ్యక్షుడు పసునూరి భిక్షపతిచారి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో భారీగా పెంచిన ఇంటి పన్నులను కట్టలేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని వివరించారు. పెంచిన ఇంటి టాక్స్‌లను వెంటనే తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనియెడల కార్పొరేషన్ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మీర్‌పేట్ బీజేపీ నాయకులు కీసర గోవర్ధన్‌రెడ్డి, సోమేశ్వర్, ప్రభాకర్, తిరుపతిరెడ్డి,నరసింహ తదితరులు పాల్గొన్నారు.

తైబజార్ వేలం 19కి వాయిదా

మేడ్చల్ కలెక్టరేట్, మార్చి 13: నాగారం తైబజార్ వేలం ఈనెల 19కి వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ భాస్కర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తైబజార్ బహిరంగ వేలం ను గురువారం నిర్వహించాల్సి ఉండగా వేలం పాటలో ఎవరూ పాల్గొనకపోవడంతో ఈనెల 19న మధ్యాహ్నం 12.30 గంటలకు వాయిదా వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

కిడ్నీ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న గ్లెనీగల్స్ అవేర్ హాస్పిటల్ డాక్టర్ల బృందం

చంపాపేట, మార్చి 13: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డాక్టర్ కరుణాకర్‌రెడ్డి అన్నారు. వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా గురువారం లింగోజిగూడ డివిజన్ బైరామల్‌గూడలోని గ్లెనీగల్స్ అవేర్ హాస్పిటల్ చీఫ్ డాక్టర్ కరుణాకర్‌రెడ్డి పర్యవేక్షణలో డాక్టర్ల బృందం, సిబ్బంది 5కే రన్ నిర్వహించి కిడ్నీ సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కరుణాకర్‌రెడ్డి, యూరాలజీ డాక్టర్ నవీన్ పూల, నెఫ్రాలజీ డాక్టర్ ప్రభుచరణ్ మాట్లాడుతూ.. మనిషి ఆరోగ్యానికి హాని కలిగించే ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. వ్యాధులను ముందుగానే గుర్తించేందుకు ప్రతి మూడు నెలలకోసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. హాస్పిటల్ కన్సల్టెన్సీ డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జల్‌పల్లి పెద్దచెరువు కబ్జాకు యత్నం..

- మట్టి పోస్తున్న ఆక్రమణదారులు.. పోలీసులకు ఫిర్యాదు చేసిన ఏఈ

జల్‌పల్లి పెద్ద చెరువు పరీవాహక ప్రాంతంలో పోసిన మట్టి కుప్పలు

పహాడిషరీఫ్, మార్చి 13: పల్లెల్లోని నీటి వనరులపై భూ బకాసురులు కన్నేశారు. చెరువులను సొంతం చేసుకోవాలని పావులు కదుపుతున్నారు. రాత్రికిరాత్రి చెరువు పూడ్చేందుకు కుట్ర పన్నుతున్నారు. జల్‌పల్లి గ్రామంలో అతిపెద్ద తాగునీటి వనరైన పెద్ద చెరువుపై కబ్జారాయుళ్ల కన్ను పడింది. ఫిరంగి నాలా కనుమరుగు కావడంతో చారిత్రక ఆనవాళ్లు కలిగిన పెద్ద చెరువు సైతం క్రమేణా అక్రమణలకు గురవుతూ వస్తున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెద్ద చెరువు కబ్జా కాకుండా అడ్డుకున్నారు. ప్రభుత్వం మారడంతో కాంగ్రెస్ నాయకుల అండదండలతో ఆక్రమణదారులు తిరిగి తమ వ్యవహారాలను చక్కదిద్దుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా రాత్రి వేళల్లో పెద్ద చెరువు పరవాహక ప్రాంతాల్లో టిప్పర్ల ద్వారా మట్టిని తెచ్చి కుప్పలుగా పోస్తున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన ఇరిగేషన్ ఏఈ వీరేందర్‌కుమార్ వెంటనే స్పందించారు. చెరువును పూడ్చేందుకు మట్టిని తరలించిన వారిని గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని గురువారం ఏఈ పహాడీషరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయునదేమనగా, నా క్లయింట్ శ్రీ మహ్మద్ ఫయాజ్ తండ్రి ఎమ్‌డి నిరంజన్ అలీ, వయస్సు సుమారు 37 సంవత్సరాలు, వృత్తి: ప్రైవేట్ ఎంప్లాయి, నివాసం: ఇం.నెం.9-6-387, ఈస్ట్ మారుతి నగర్, చంపాపేట్, సరూర్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా-500079, తెలంగాణ రాష్ట్రం వారు దిగువ తెలిపిన షెడ్యూల్ ఆస్తిని (1) శ్రీ సిరుగుమల్ల ధర్మపాల్ తండ్రి స్వర్గీయ ఎస్.రంగస్వామి, (2) శ్రీ సిరుగుమల్ల చక్రపాణి తండ్రి స్వర్గీయ ఎస్.రంగస్వామి మరియు (3) శ్రీ సిరుగుమల్ల పార్థసారథి తండ్రి స్వర్గీయ ఎస్.రంగస్వామి, అందరి నివాసం: ఇం.నెం.9-7-74/2, మారుతి నగర్, చంపాపేట్, సరూర్‌నగర్ మండలం, రంగారెడ్డి జిల్లా-500079, తెలంగాణ రాష్ట్రం మరియు (4) శ్రీమతి ఎస్.రమాదేవి భర్త ఎస్. దేవ్‌రాజ్, తండ్రి స్వర్గీయ ఎస్.రంగస్వామి, నివాసం: ఇం.నెం.15-3-125/124/123, గౌలిగూడ కమాన్, నాంపల్లి, హైదరాబాద్-500012, తెలంగాణ రాష్ట్రం వారి నుండి కొనుగోలు చేయాలని ఉద్దేశిస్తున్నారు మరియు మొత్తం అమ్మకం ప్రతిఫలంలో భాగంగా బయానా నిమిత్తం కొంత మొత్తాన్ని కూడా చెల్లించారు.

ఎవరేని వ్యక్తి/వ్యక్తులు, ఇన్‌స్టిట్యూషన్స్ సదరు షెడ్యూల్ ఆస్తి లేదా అందలి ఏదేని భాగంలో ఏదేని హక్కు, టైటిల్, ప్రయోజనం, చార్జ్, డిమాండ్, క్లెయిం లేదా అభ్యంతరాలు కలిగి ఉన్నచో ఈ నోటీస్ ప్రచురణ తేదీనుండి ఏడు (7) రోజులలోగా అన్ని ఒరిజినల్ డాక్యుమెంటరీ రుజువుతో సహా వ్రాతపూర్వకంగా దిగువ సంతకందారుకు తెలియజేయవలెను, లేనిచో నా క్లయింట్ సదరు షెడ్యూల్ ఆస్తిపై ఏవిధమైన క్లెయింలు, చార్జెస్, అభ్యంతరాలు, లిటిగేషన్స్ లేవని భావించి తదుపరిగా ముందుకు సాగుతారు మరియు అమ్మకం లావాదేవీని పూర్తిచేస్తారు మరియు సేల్ డీడ్ ఎగ్జిక్యూట్ చేసి రిజిస్టర్ చేయబడును. ఆ తరువాత ఎలాంటి అభ్యంతరాలు లేదా క్లెయింలు ఎట్టిపరిస్థితిలోనూ అనుమతించబడవు మరియు వదులుకున్నట్లుగా భావించబడును.

ఆస్తి షెడ్యూల్

ఎల్‌బి నగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ పరిధి, రంగారెడ్డి జిల్లా, సరూర్‌నగర్ మండలం, సుల్తాన్‌వాల్యా గ్రామం, మారుతినగర్ బ్లాక్ నెం.7, వార్డ్ నెం.9 వద్ద గల సర్వే నెం.28 మరియు 29లో గ్రౌండ్ ఫ్లోర్: 2196 చ.అ. (ఆర్‌సిసి), మొదటి అంతస్తు: 2196 చ.అ. (ఆర్‌సిసి), మరియు రెండవ అంతస్తు (టెర్రస్) 382 చ.అ.(ఆర్‌సిసి)తో, 250.0 చ.గజాలు లేదా 209 చ.మీటర్లు విస్తీర్ణం, ప్లాట్ నెం.26పై ఇం.నెం.9-7-184 (PTIN No. 1030900651) (పాత ఇం.నెం.6-59/1) కలిగిన ఆస్తి యావత్తు, సరిహద్దులు: ఉత్తరం: 25' వెడల్పు రోడ్, దక్షిణం: ప్లాట్ నెం.31, తూర్పు: ప్లాట్ నెం.25, పడమర: ప్లాట్ నెం.27.

బి. హరినాథ్ రావు, ఎన్.శ్రీదేవి, అడ్వకేట్స్
ప్లాట్ నెం.620, ఇం.నెం.16-11-22/ఎ, జ్ఞానదీప్ టవర్స్, మోర్ సూపర్ మార్కెట్ ఎదురుగా, మూసారంబాగ్, మలక్‌పేట్, హైదరాబాద్-500036 (టిఎస్), మొబైల్ నెం. 9849888058